నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్: హయత్‌నగర్ 1, 2 బస్ డిపోల పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టి తీసుకురావాలని డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్ తెలిపారు. అందుకు శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఫోన్ చేసి నేరుగా డిపో మేనేజర్లకు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చని తెలిపారు. హయత్‌నగర్ డిపో–1 ఫోన్ నం. 99592 26138, డిపో–2 ఫోన్ నం.99592 26419.

నేడు పంచాంగ శ్రవణం

వనస్థలిపురం: సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో 'పంచాంగ' శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు బ్రహ్మశ్రీ దేవులపల్లి పవనకుమార సిద్ధాంతి పంచాంగాన్ని వివరిస్తారని తెలిపారు. అదే విధంగా రాగ మ్యూజిక్ అకాడమీ పెనుమూడి పద్మజశర్మ శిష్య బృందం సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సంక్షేమ సంఘం భవనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న మాధవనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పలు కాలనీలలో పెండింగ్ పనులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హన్మంత్‌రెడ్డి, బెనర్జీ, అనసూయ, చందునాయక్, శంభూప్రసాద్, ముత్యాలు, ప్రేమ్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 10, వంకాయ 18, బెండ 35, పచ్చి మిర్చి 28, కాకర 35, బీర 35, క్యాబేజీ 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 17, దొండ 23–28, చిక్కుడు 55, గోకర 35, బీట్‌రూట్ 13, క్యాప్సికం 35, ఆలుగడ్డ 21, దోస 18, సొరకాయ 9, పొట్లకాయ 15, ఉల్లిగడ్డ 24.

విద్యార్థి అదృశ్యం


నితీన్‌రెడ్డి(ఫైల్)

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామరెడ్డి జిల్లా, భిక్కూర్, లక్ష్మీదేవిపల్లికి చెందిన ఏనుగు రాంరెడ్డి నగరానికి వచ్చి బండ్లగూడ ఆనంద్‌నగర్ నివాసం ఉంటున్నాడు. రాంరెడ్డి పెద్ద కుమారుడు ఏనుగు నితీన్‌రెడ్డి (24) గతంలో ఎంఎస్సీ చదవడానికి అమెరికా వెళ్లి 3 నెలల క్రితం ఇండియాకు వచ్చాడు. ఈనెల 27 తేదీన ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు సరిసర ప్రాంతాలల్లో వెతికిన ప్రయోజనం లేక పోవడంతో తండ్రి ఏనుగు రాంరెడ్డి నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి రూ.50వేలు చోరీ

చైతన్యపురి: తాళం వేసిన ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలు చోరీ చేసిన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు... భవానీనగర్ కాలనీలో నివసించే గుడిషాల విజయ్ ఉప్పల్ భగాయత్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. హోటల్ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.50వేలు కనిపించలేదు. వెంటనే విజయ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బట్టల దుకాణంలో చీరల అపహరణ

చైతన్యపురి: గుర్తుతెలియని మహిళలు బట్టల దుకాణంలో దుస్తులు చోరీ చేసుకెళ్లిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బహదూర్‌పురాకు చెందిన దినేష్‌కుమార్ శర్మ కొత్తపేట మార్గదర్శి కాలనీలో కేఆర్ కనత్ ఫ్యాబ్రిక్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఐదుగురు మహిళలు దుకాణంలోకి వచ్చారు. వారు వెళ్లిపోయిన తరువాత చూడగా షాప్‌లోని కొన్ని దుస్తులు కనబడలేదు. శుక్రవారం చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


విద్యుత్‌నగర్ కాలనీలో రహదారి పక్కన బిల్డింగ్ వర్థాలు


కొట్టివేసిన చెట్లకొమ్మలు

పడకేసిన పారిశుద్ధ్యం.!

- నక్రమంగా నిర్వహించని పారిశుద్ధ్య పనులు
- కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెట్ల కొమ్మలు, మట్టికుప్పలు


విద్యుత్‌నగర్‌లో నెల రోజులుగా దర్శనం ఇస్తున్న చెట్ల కొమ్మలు

చైతన్యపురి: పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ లోపించడంతో చైతన్యపురి డివిజన్‌లో ఎక్కడ చూసినా దుర్గంధం కనిపిస్తోంది. పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పాలకులు, అధికారులు ఉపన్యాసాలు దంచికొడుతున్నారే తప్ప నిర్వహణను గాలికొదిలేశారు. విద్యుత్‌నగర్, న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీ, సాయినగర్, ప్రభాత్‌నగర్, శాలివాహననగర్ తదితర కాలనీలలో రహదారుల పక్కన ఎక్కడ పడితే అక్కడ మట్టికుప్పలు, ఎండిపోయిన చెట్లకొమ్మలు కనిపిస్తున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవటం వల్ల కాలనీలలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.

- భవన నిర్మాణ వ్యర్థాలను యజమానులు రోడ్ల పక్కనే వేస్తున్నారు. అయినా అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.
- కొంత కాలంగా పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించటం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. కనీసం రోడ్లు కూడా ఊడ్చడం లేదన్నారు.
- కొట్టివేసిన చెట్లకొమ్మలు వెంటనే తొలగించటం లేదన్నారు. దీంతో వర్షాలు కురుస్తుండటంతో దోమల బెడద పెరిగిందన్నారు.
- సిబ్బంది కొరత కారణంగా పారిశుద్ధ్యం పనులు సక్రమంగా జరగడం లేదని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు.
- కాలనీలలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు...



డివిజన్‌లో పారిశుద్ధ్యం పనులు సక్రమంగా జరకపోవటం వాస్తవమే. కాలనీలన్నీ చెత్తమయంగా తయారవుతున్నాయి. సిబ్బంది కొరత వల్ల ఇలా జరుగుతోంది. ఇక్కడ పనిచేసే పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు విధులు సరిగా నిర్వహించడం లేదని డీసీకి ఫిర్యాదు చేశాం. అయినా వారిలో మార్పు రాలేదు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగటం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నారు. సిబ్బందిని పెంచి సక్రమంగా పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– రంగా నర్సింహగుప్తా, చైతన్యపురి కార్పొరేటర్

డీఎస్‌నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం


డీఎస్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, అధికారులు

సైదాబాద్: దామోదర సంజీవయ్యనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. డీఎస్‌నగర్ సమీపంలో నిర్మిస్తున్న ట్విన్ టవర్స్ బహుళ అంతస్తుల నిర్మాణానికి సంబంధించిన డ్రైనేజీ కనెక్షన్లను జీహెచ్‌ఎంసీ సీవరేజీ లైన్‌లో కాకుండా స్థానికంగా ఉన్న నాలాలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని డీఎస్‌నగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. బహుళ అంతస్తుల నిర్మాణ డ్రైనేజీ లైన్లను నాలాలో కలిపితే చిన్నపాటి వర్షానికే నాలా పొంగి బస్తీ ముంపునకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డీఎస్‌నగర్ బస్తీలో పర్యటించారు. బస్తీవాసులు అక్కడి డ్రైనేజీ సమస్య తీవ్రతను వారికి వివరించారు. డీఎస్‌నగర్ బస్తీవాసుల డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. బహుళ అంతస్తుల నిర్మాణదారులు అనుమతులకు అనుగుణంగా వాటర్, డ్రైనేజీ పనులు నిర్వహించేలా పర్యవేక్షించాలని కోరారు. బస్తీలో పర్యటించిన వారిలో జీహెచ్‌ఎంసీ డీసీ మంగతాయారు, ఈఈ ఏకాంబరం, ఏఈ శిరీష, వాటర్‌వర్క్స్ మేనేజర్ మినాజ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, బస్తీవాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద సమస్యలు పరిష్కరించండి


ధ్వంసమైన ఫుట్‌పాత్‌ను చూపిస్తున్న దళిత సంఘాల నాయకులు

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు మూసారంబాగ్‌లోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాకు తరలివచ్చారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో అక్కడ ఉన్న సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా మలక్‌పేట మాల సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫుట్‌పాత్ ధ్వంసమైందని వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. దిమ్మె చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహనీయుల విగ్రహాల దిమ్మెలకు బ్యానర్లు, పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 14వ తేదీలోపు సమస్యలు పరిష్కరించి జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

హస్తినాపురం డివిజన్‌ను అభివృద్ధి పరుస్తాం

ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్


హస్తినాపురంలో కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి పర్యటిస్తున్న మధుయాష్కీగౌడ్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి శుక్రవారం మధుయాష్కీగౌడ్ శ్రీరమణకాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ అభివృద్ధికి రూ.16.12కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. ఏపీఎస్ఈబీ కాలనీలో రూ.12.50 కోట్లతో కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. శ్రీరమణకాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.89.37 లక్షలు, ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీలో బీటీ కరోడ్డు మరమ్మతులకు రూ.15 లక్షలు, భీమానగర్‌కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.30లక్షలు, అగ్రికల్చర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.81.50లక్షలు, విజయదుర్గా కాలనీ సీసీరోడ్డుకు రూ.35లక్షలు, శివసాయినగర్‌కాలనీలో సీసీరోడ్డుకు రూ.25లక్షలు, దాతూనగర్, వెంకటేశ్వరకాలనీ, శ్రీరమణకాలనీ ఫేజ్01, రోడ్ల నిర్మాణానికి రూ.86.75లక్షలు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

టీఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్



మలక్‌పేట: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో సర్కార్ విఫలమైందని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మలక్‌పేట ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిందని, విద్యాశాఖ మంత్రిని ఎప్పుడు నియమిస్తారని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలు, హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో కనీస వసతులు కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే విద్యార్థి ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. టీఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న తేదీన మూసారంబాగ్ చౌరస్తాలో మహనీయుల జయంతి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈర్ల ప్రసాద్, గ్రేటర్ జనరల్ సెక్రటరీ నిమ్మల సతీష్ మహాజన్, తదితరులు ఉన్నారు.

మూడు రోజులు మలక్‌పేట గంజ్ బంద్

చాదర్‌ఘాట్: పండగల నేపథ్యంలో మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి సోమవారం వరకు సెలవులు ఉంటాయని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. మూడు రోజుల పాటు గంజ్ బంద్ ఉంటుందని రైతులు గమనించాలన్నారు. మార్కెట్ కార్యకలాపాలు యథాతథంగా మంగళవారం నుంచి కొనసాగుతాయని తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

చాదర్‌ఘాట్: 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి ఈ.మల్లేశం తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. మూడు రోజులు మార్కెట్‌కు సెలవులు ఉన్నాయన్నారు. వచ్చే మంగళవారం చలివేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధం అవుతారని పేర్కొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి


క్రాంతిహిల్స్‌కాలనీలో పార్కు ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: కాలనీలలో సమస్యల పరిష్కారానికి, కాలనీల సమగ్ర అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. క్రాంతిహిల్స్ కాలనీలో హెరాల్డ్ స్కూల్ ముందు ఉన్న పార్కు ప్రహరీ నిర్మాణం, చింతలకుంట రేడియో కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు బద్దం రాంరెడ్డి, కంచర్ల సత్తిరెడ్డి, మనోహర్, రామాంజరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేష్, కోటేశ్వర్‌రావు, రవిందర్‌రెడ్డి, సునంద, నాయకులు నరసింహాయాదవ్, అజయ్‌యాదవ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

పేదలకు కేటాయించిన భూములు ఇవ్వాల్సిందే..


సాగర్ రోడ్డులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హస్తినాపురం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామంలోని సర్వే నం.189, 203లలో 577 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆ భూముల వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ప్రశ్నించారు. శుక్రవారం సాగర్‌రింగ్‌రోడ్డులో ప్లకార్డులతో కమిటీ సభ్యులు మంతాని యాదయ్య అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వం కేటాయించిన భూములను రామోజీ ఫిలిం సిటీ కబ్జా చేసిందన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన పేదలపై లాఠీచార్జీ చేసి భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలకు కేటాయించిన భూమిని ఇచ్చేంత వరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, ఇళ్ల స్థలాల కన్వీనర్ పి.జగన్, ఇతర నేతలను గాయపరిచి అరెస్ట్ చేయడం సిగ్గుచేటని అన్నారు.

రామోజీ ఫిలింసిటీలో భూ పోరాటం చేసి తీరుతాం..

- పేదలకు ప్రభుత్వం కేటాయించిన భూములను వెంటనే వారికి ఇచ్చేందుకు రామోజీ ఫిలింసిటీ గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కేసులను ఎత్తివేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఇల్లు లేని పేదలందరినీ సమీకరించి రామోజీ ఫిలింసిటీలో భూ పోరాటం చేసి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కమిటీ సభ్యులు పొట్టిపాక రామస్వామి, భూషరాజు కాశయ్య, రాధమ్మ, అంజమ్మ, శాంతి, గంగమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలం

మాజీ మంత్రి టీజీ వెంకటేష్


మాట్లాడుతున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్, వేదికపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: వైశ్యులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని.. కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలమని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ అన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహిళా విభాగ్ మహాసభ మహిళా మహోత్సవం శుక్రవారం నాగోలులో జరిగింది. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డా. ఉప్పల శారద, జనరల్ సెక్రటరీ కాచం సుష్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాడి లక్ష్మీనారాయణ, కాచం ఫౌండేషన్ అధినేత కాచం సత్యనారాయణ గుప్తా, పసునూరి శ్రీనివాస్, హాజరై ప్రసంగించారు. మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళల ఫ్యాషన్ షో అందరినీ అలరించింది. మహిళలను ఉత్సాహపరచడానికి తంబోలా ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ ఎమ్మెల్యేలు అంబికా కృష్ణ, దేవకీ వెంకటేశ్వర్లు, స్టేట్ ఉమెన్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, ఇండియన్ కూచిపూడి ఎక్స్‌పోనెంట్ అండ్ మ్యూజిక్ టీచర్ పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోరక్ష మహా పాదయాత్ర


మహా పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి

సైదాబాద్: సకల దేవతా స్వరూపమైన గోమాతను రక్షించాలని... గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన మహా పాదయాత్ర ముగిసింది. సైదాబాద్‌కు చెందిన ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి బృందం 2024 సెప్టెంబర్ 27న కాశ్మీర్‌లో మొదలపెట్టిన మహా పాదయాత్ర 182 రోజులు 5150 కిలోమీటర్లకు పైగా సాగి గురువారం కన్యాకుమారిలో ముగిసింది. గోరక్షణ కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తాము చేసిన పాదయాత్రకు దేశంలోని ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. కన్యాకుమారిలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన పాదయాత్ర ముగింపు సదస్సులో పాల్గొన్న వక్తలు పాదయాత్ర చేసిన బృందాన్ని సత్కరించారు.

లీకేజీ.. జర దేఖోజీ.!

మలక్‌పేట: వేసవి కాలంలో నీటి కొరత అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తాగునీటి వృథాను అరికట్టడంలో విఫలమవుతున్నారు. నీరు చాలా విలువైంది, జాగ్రత్తగా వాడుకోవాలని.. వృథా చేయకూడదని అవగాహన కల్పించే అధికారులు తాగునీటి వృథాను పట్టించుకోవడం లేదు. లీకేజీలు అరికట్టడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. మ్యాన్‌హోళ్ల వద్ద వాల్వ్ లీకేజీ, పైపులైన్ పగిలి వాటర్ గంటల కొద్ది రోడ్లపై పారుతున్నాయి. రోజులు గడుస్తున్న అధికారుల నుంచి ఎలాంటి స్పందన ఉండదన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన సమస్య వైపు అధికారులు తొంగి చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మూసారంబాగ్, అక్బర్‌బాగ్‌లో అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా లీకేజీలే కనిపిస్తున్నాయి. ప్రత్యేక దృష్టి సారించి లీకేజీలు అరికట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మూసారంబాగ్ - అంబర్‌పేట దారిలో..


అక్బర్‌బాగ్ బీ-బ్లాక్‌లో..


మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా..